క్లుప్తంగా

అక్రమ లేఅవుట్‌పై నోటీసు

మానవపాడు: మండలంలోని పల్లెపాడు గ్రామ పంచాయతీలో సర్వే నంబర్ 181.ఏ.1లో మూడు ఎకరాల భూమిలో చేపట్టిన లేఅవుట్ వేసిన యజమానికి అధికారులు నోటీసులు అందజేశారు. గ్రామానికి చెందిన కుర్వ గోకారీ పంచాయతీ సెక్రటరీ నరేందర్‌రెడ్డి అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు చేశారంటూ ఫిర్యాదు చేశారు. మూడు రోజుల్లో లేఅవుట్ నిర్మాణాలు తొలగించాలని సెక్రటరీ నోటీసులో పేర్కొన్నారు.

బైక్‌కు నిప్పు.. కేసు నమోదు

మానవపాడు: ఇంటి ఎదుట ఉంచిన బైక్‌కు నిప్పు పెట్టిన ఘటనలో కేసు నమోదైనట్లు ఏఎస్‌ఐ జమీరుద్దీన్ మంగళవారం తెలిపారు. మండలంలోని కొర్విపాడులో కుర్వ మద్దిలేటి ఆదివారం తన ఇంటి ఎదుట ఉంచిన డీలక్స్ బైక్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో బైక్‌కు పూర్తిగా దగ్ధమైంది. కుర్వ మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం జరిగిన అండర్–14, అండర్– 17 క్రీడా పోటీల్లో స్థానిక విద్యార్థులు సత్తా చాటారు. 22 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి పోటీలు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ జితేందర్, సుహాసిని, రత్నమాల, ఆనంద్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అలంపూర్‌రూరల్: అలంపూర్ మండల పరిధిలోని భీమవరంలో ఉల్లి, మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి పరిశీలించారు. మండలంలో మొక్కజొన్న 7,120, ఉల్లి పంట 570 ఎకరాల్లో సాగు అవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామంలో వీధికుక్కల దాడిలో నలుగురు వ్యక్తులు గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రుక్మద్ బాషా, ఉషన్న, పరమేష్, రమేష్‌పై వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

పురాతన బావిని శుభ్రం చేసిన యువకులు



గట్టు: మండల కేంద్రంలోని సంత బజార్ భవానీమాత ఆలయం వద్ద ఉన్న పురాతన శేషం బావిని ఎస్ఎస్‌కే సమాజ్ యువకులు శుభ్రం చేశారు. బావిలోని నీటిలో చెత్తాచెదారం పడి దుర్వాసన వస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రెండు మోటార్లు ఏర్పాటు చేసి బావిలోని నీటిని తొలగించారు. మూడు రోజులుగా శుభ్రం చేస్తున్నట్లు యువకులు పేర్కొన్నారు.

బాలల సంక్షేమం అందరి బాధ్యత



ధరూరు: బాలల సంక్షేమాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బాలల సంక్షేమం కోసం 1098 దేశవ్యాప్తంగా పని చేస్తుందన్నారు. బాలలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలతో సోదరభావం కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపుల చట్టం 2012 గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు ఏ విధమైన సమస్యలతో బాధపడుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. మహిళా సాధికారత, బేటీ బచావో.. బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన కార్యక్రమాల గురించి పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సభ్యురాలు సరోజ, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ దస్తగిరి, హెల్త్ సూపర్‌వైజర్ హీర్యానాయక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా గ్రామీణ రోడ్లు

- రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రమాదభరితంగా సద్దలోనిపల్లి- నేతువానిపల్లి రోడ్డు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు ప్రమాదభరితంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి, బిజ్వారం నుంచి గద్వాల, మల్దకల్ నుంచి గట్టు, తాటికుంట స్టేజీ నుంచి తప్పెట్ల మొర్సు, మల్దకల్ నుంచి ఎల్కూర్, మల్లెందొడ్డి నుంచి విఠలాపురం గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం



గుంతలమయంగా బిజ్వారం- గద్వాల రోడ్డు

జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

అదుపుతప్పుతున్న వాహనాలు

రోడ్లపై ఏర్పడిన గుంతలతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా బైక్‌లు, ఆటోలు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొందంటున్నారు.

అధికారులకు పట్టడం లేదు

మండలంలో ఏర్పడిన అధ్వాన్న రోట్లు దుస్థితిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలే ధ్వంసమైన రోడ్లు ఆపై గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న రోడ్లపై గుంతలకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



సద్దలోనిపల్లి– నేతువానిపల్లి రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ఆస్పత్రుల పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

\- నర్సింహులు, నేతువానిపల్లి

గుంతలతో ప్రమాదాలు



బిజ్వారం నుంచి గద్వాలకు వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బీటీ రహదారికి మరమ్మతు చేపట్టకపోవడంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- గోవిందు, బిజ్వారం

సమస్య పరిష్కరిస్తాం



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రహదారులను పరిశీలించి నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.

\- బషీర్, పంచాయతీరాజ్ ఏఈ

మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి



శాంతినగర్‌లో వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు



ఉండవెల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతినగర్: దివంగత ముఖ్యమంత్రి, మహా నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగశిరోమణి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరనిలోటన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

దివంగత సీఎంకు ఘన నివాళి

ఉండవెల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రమణ, మద్దిలేటి, నయీం, రమేష్, నాగేష్, మగ్బుల్, మక్తర్ బాషా, రవి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



సమీక్షలో కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశం హాలులో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2025లో పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 26వ స్థానంలో నిలిచిందన్నారు. గతంతో పోల్చితే 10.36 శాతం వృద్ధితో మంచి ఫలితాలు సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే అధికారులు కృషి చేయాలన్నారు. ఈ నెల 6న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి నెల పాఠశాలల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగారావు, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నుషిత, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి అక్బర్, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు



బోరవెల్లిలో రేషన్ కార్డులు అందిస్తున్న సతీష్‌రెడ్డి

మానవపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు అందజేస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి, జిల్లా డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని బోరవెల్లి, పెద్దఆముదాలపాడు, పెద్దపోతులపాడు గ్రామాల్లో రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తుందన్నారు. బోరవెల్లిలో 137 రేషన్‌కార్డులు వచ్చాయన్నారు. పెద్దఆముదాలపాడు 40, పెద్దపోతులపాడులో 40 రేషన్‌కార్డులు లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, పరమేష్‌నాయుడు, రాజు, బాషా, మద్దిలేటి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఉంటేనే ఓటు అడుగుతాం..

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ఉంటేనే ఓటు అడుగుతామని రాష్ట్ర రోడ్డు రవాణా మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోరవెల్లి, పెద్దఆముదాలపాడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. నాణ్యతతో ఇళ్లు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: నియోజకవర్గంలో తాను ఏడేళ్లలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, మీ మాదిరి 15 రోజులకోసారి గద్వాలకు వచ్చి రాజకీయం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎంపీ డీకే అరుణ తనపై చేసిన ఆరోపణలు అన్ని అవాస్తవమని కొట్టిపారేశారు. తాను గద్వాల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని, అంతమాత్రాన పార్టీ మారారంటూ, పర్సెంటేజీలు, అవినీతి కోసమంటూ ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. గద్వాల అభివృద్ధిపై నిజంగా ఎవరు ఎంత అభివృద్ధి చేశారు అంకెలతో సహా చెప్పటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఎక్కడ బహిరంగ చర్చ పెడతారో అక్కడికి వచ్చి చర్చిస్తానన్నారు. అనంతరం ఈ నెల 6వ తేదీన గద్వాలకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. డబుల్‌బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్, కృష్ణ, శ్రీమన్‌నారాయణ, నాగేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



శాంతినగర్: వడ్డేపల్లి మాజీ కౌన్సిలర్ భర్త డీలర్ శ్రీనును ఎమ్మెల్యే విజయుడు మంగళవారం పరామర్శించారు. ఇటీవల డీలర్ శ్రీను కాలుకు సర్జరీ కావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శాంతినగర్‌లోని ఆయన నివాసానికి చేరుకొని సానుభూతి తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం



గట్టు: గ్రామాల్లో అందించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి మురళీ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పెంచికలపాడులో భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రాగిణి, ఫార్మసిస్ట్ జిలాని, సీఓ హలీంపాష తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా విడుదల



అలంపూర్‌లో ఓటర్ జాబితా విడుదల చేస్తున్న అధికారులు

అలంపూర్‌రూరల్: అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో మంగళవారం ఫొటో ఓటర్ జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పద్మావతి మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో కార్యాలయంలోని నోటీసు బోర్డుల్లో ఓటర్ జాబితాను అతికించినట్లు తెలిపారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల జాబితా కూడా విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ఇటిక్యాల: మండలంలోని 14 గ్రామ పంచాయతీ ల్లో ఓటర్ జాబితా విడుదల చేసినట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ తెలిపారు. మండలంలో మొ త్తం 130 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 18, 969 ఓటర్లు ఉండగా.. పురుషులు 9,382, స్త్రీలు 9, 586 మంది 1 ఇతరులు ఓటరు ఉన్నట్లు ప్రకటించారు.

ముసాయిదా జాబితా విడుదల

ఎర్రవల్లి: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో తుది ఓటర్ జాబితాను విడుదల చేసినట్లు ఎంపీ డీఓ అబ్దుల్ సయ్యాద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపా రు. మండలంలో మొత్తం 144 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 23,345 ఓటర్లు ఉండగా.. పురుషులు 11,535, స్త్రీలు 11,810 ఉన్నట్లు పేర్కొన్నారు.

'చలో హైదరాబాద్' కరపత్రాల విడుదల



ధరూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న కార్తీక్

ధరూరు: గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఈ నెల 7న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జెమ్మిచేడు కార్తీక్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో కరపత్రాలు విడుదల చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సుకు పెద్దఎత్తున కార్మికులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, అశోక్, భీమన్న, రమేష్, పరుశురాముడు, గోవిందు, నాగరాజు, భీమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

గట్టు: గ్రామ పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలంటూ ఈ నెల 7న నిర్వహించే చలో హైదరాబాద్ సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయు నాయకులు కోరారు. మంగళవారం ఇందువాసి గ్రామంలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా నాయకురాలు ఇందువాసి బజారమ్మ, తాయమ్మ, దావీదు, తాయప్ప, నర్సింహులు, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాలటౌన్: దశాబ్దాలుగా బీసీలు ఎదురుచూస్తున్న బీసీ రిజర్వేషన్ కల కాంగ్రెస్‌తోనే నిజమైందని టీపీసీసీ నాయకుడు శంకర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా అసెంబ్లీలో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం చారిత్రాత్మకమన్నారు. జనాభా ప్రకారం బీసీలకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలన్న రాహుల్‌గాంధీ ఆశయాలను నెరవేర్చే క్రమంలో మంచి పరిణామం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం బీసీలను పట్టించుకోలేదన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకవెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇసాక్, భాస్కర్‌యాదవ్, పులిపాటి వెంకటేష్, లక్ష్మణ్, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, రాముయాదవ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో సోదరభావంతో మెలగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గట్టు: మహిళలతో సోదర భావంతో మెలగాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. రక్షణ, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం బాల సంరక్ష భవన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలనవారు. చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించే దిశగా అడుగులు ముందుకు వేయాలని కోరారు. బాలల లైంగిక వేధింపుల నిరోధకం చట్టం 2012 గురించి వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలికలు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది నవీన్, ఇన్‌చార్జ్ హెచ్ఎం నర్సింహులుగౌడ్, కానిస్టేబుల్ స్వామిరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి



గట్టులో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

గట్టు/మల్దకల్/ధరూరు/కేటీదొడ్డి/అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం గట్టు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల రాజకీయాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆరోపించారు. కేసీఆర్‌పై ఎన్ని కుట్రలు పన్నిన, ప్రజల మద్దతులో తిప్పికొడతామన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉందని, దాని దృష్టిని మరల్చడానికి కాళేశ్వరం డ్రామా ఆడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమలలో నాయకులు అంగడి బస్వరాజు, జయసింహారెడ్డి, నరేందర్‌నాయక్, రామునాయుడు, తిమ్మప్పగౌడు, వెంకటేష్, బల్గెర కిష్టప్ప, బాసుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

❖ మల్దకల్ మండల కేంద్రంలోని బస్టాండు చౌరస్తాలో అయిజ– గద్వాల ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్‌గౌడ్, రామకృష్ణ, మల్లికార్జున, చిన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

❖ ధరూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో రోడ్డుపై బైటాయించి బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మండల నాయకులు రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, అబ్రహం, భరత్, లక్ష్మయ్య, రాముడు, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

❖ కేటీదొడ్డి మండల కేంద్రంలోని గద్వాల– రాయచూర్ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలోని నాయకులు రోడ్డుపై నల్ల బ్యాడ్జీలు ధరించి రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాజుల కృష్ణ, రవి, కిష్టప్ప, నర్సింహులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

❖ బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆధ్వర్యంలో అయిజ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని చించివేసి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో..